


# లైఫ్ @ చార్మినార్

*A Docu -Poem*

(జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు గెల్చుకున్న డాక్యుమెంటరీ)



— అయినంపూడి శ్రీలక్ష్మి

# లైఫ్@చార్మినార్

A Docu-Poem

(జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు గెల్చుకున్న డాక్యుమెంటరీ)

## అయినంపూడి శ్రీలక్ష్మి




సరోజినీ శ్యాంసుందర్ వృద్ధాశ్రమ సేవాసంఘం
హైదరాబాద్
ప్రచురణ - 3

Life @ Charminar
(A Docu - poem)

©

**Inampudi Srilaxmi**
Cell : 99899 28562
Email : shree_translator@yahoo.com
shreelaxmi.inampudi@gmail.com
www.inampudishreelaxmi.blogspot.com

First Edition :
May 2011 (1000 copies)

Price : **Rs. 75/- $ 3**

Published by :
**Sarojini Shyamsundar Vruddhashrama Seva Sangham, Hyderabad**
Publication No. 3

For Copies :
Flat No. 103, Durga Apartments,
Somajiguda, Hyderabad.

*Available at all Popular Book Houses*
ebook@www.kinige.com

Cover Design : **Surya Dubey**

Illustrations : **Hari**

DTP Layout & Printing :
**Ankush**
Nallakunta, Hyderabad.
Cell : 9912929078. email : ankush.pd@gmail.com

# అంకితం

నాకు ఊపిరినిచ్చిన
నిజామాబాద్ జిల్లాకు...

నాకు ఉత్సాహాన్నిస్తున్న
కరీంనగర్ జిల్లాకు...

నాకు స్ఫూర్తిగా నిలుస్తున్న
హైదరాబాద్‌కు...

## కవిత్వ కాల్పనికత + దృశ్య వాస్తవికత = 'డాక్యుపోయెమ్'

"Poetry create series of visuals from words and enable the readers to feel them. In general, the experinence of a visual is possible only through the images, either still or moving, captured through the human eye. But poetry is the only alternative to create that visual impact, not with the images, but with the means of words. Thats why, any piece of poetry which is a sensible presentation has been experienced as the series of visual imageries than that of mere words."

నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీతల Award acceptence Speech లలో ఎక్కడో చదివిన ఈ మాటలు నాకు అనాలోచితంగా గుర్తొచ్చిన సందర్భం అది...! 'కరీంనగర్ ఫిలిం సొసైటీ' (కఫిసొ) వారు నిర్వహించిన 5వ 'జాతీయ లఘుచిత్రాలు, డాక్యుమెంటరీ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో జ్యూరీ మెంబర్‌గా నేను ఓ డాక్యుమెంటరీని చూసిన తర్వాత నాలో కలిగిన భావపరంపరకు దగ్గరగా ఉన్న మాటల సమాహారమిది!

ఆ డాక్యుమెంటరీయే "లైఫ్ @ చార్మినార్!"

అటు కవిత్వంలోనూ, ఇటు డాక్యుమెంటరీలలోనూ ఓ కొత్త పంథాకు దారులు తీసిన నవ్యప్రయోగం ఇది. సాధారణంగా పోయెట్రీ అక్షర సంకలితం! డాక్యుమెంటరీ దృశ్య ప్రామాణికం! ఈ రెండింటికీ మధ్య ఉండే విభజన రేఖను, సరిహద్దు గీతలను చెరిపేసి, రెండింటి సమన్వయంతో – సమ్మేళనంతో సంపూర్ణ రససిద్ధిని కల్గించిన వినూత్న... విశిష్ట... వైవిధ్య ప్రయోగం - "లైఫ్ @ చార్మినార్!"

సాహిత్యంలో మనకు కవిత్వం, కథ, నవల... ఇలా ఎన్నెన్నో సృజనాత్మక ప్రక్రియలున్నాయి. ఈ Creative Forms అన్నీ భాష ద్వారా, పదాల ద్వారా పాఠకుల మనోయవనికపై నిర్దిష్టమైన దృశ్యాలను – సన్నివేశాలను సృష్టించడం సహజం. అయితే దృశ్యం అనే Phenomenon కంటికి సంబంధించిన విన్యాసం. కాని సాహిత్యంలోని ఈ ప్రక్రియలు అక్షరాలు – పదాలు – వాక్యాల సుమేళనం ద్వారా భౌతిక నేత్రాలకు ఆవల అంతర్ నేత్రాన్ని తెరిపించి అక్కడ ఓ Virtual దృశ్య ప్రపంచాన్ని ఆవిష్కరిస్తాయి. అలా ఆవిష్కరించే సృజనాత్మక సాహితీ రూపాలన్నింటిలో కవిత్వం సమున్నతమైంది అనడంలో అతిశయోక్తిలేదు. అంతేకాక ఇదంతా ఓ Psychological Process! దీనిలో Stimulus భాషాపరమైన కవిత్వమైతే, దానికి ప్రతిస్పందన (Response) దృశ్యపరమైన భావచిత్రాలు! ఇలా కవిత్వానికి సహజంగానే ఒనగూడిన దృశ్యీకరణ దక్షతకు తోడుగా భౌతిక దృశ్యాలు – సన్నివేశాల Motion Picture ను జతచేస్తే ఎలా ఉంటుంది?

ఇంకెలా ఉంటుంది?

"లైఫ్ @ చార్మినార్"లా ఉంటుంది!

***

"లైఫ్ @ చార్మినార్" !

టైటిలే ఎంతో ఆకట్టుకునేలా ఉంది!

వందలాది సంవత్సరాల సాంస్కృతిక కొనసాగింపుకు ప్రతినిధిగా కనిపిస్తున్న 'చార్మినార్'కు 'లైఫ్' అనే ఆంగ్లపదబంధం కలిసినతీరు, రెండు పదాలకు లింకుగా @ సింబల్‌ను వాడిన తీరు Newgen ideology కి Post - Modernism లోని అభివ్యక్తికి ప్రతిరూపంలా అనిపించింది. నాలో ఒకింత ఆసక్తి రేకెత్తించింది. ఇక ఈ టైటిల్‌కి ట్యాగ్‌లైన్‌గా వాడిన Docu - Poem అయితే ఎంతగానో ఆలోచింపచేసింది. డాక్యుమెంటరీ ఫిలిమ్ చరిత్రలోనే తొలి పద ప్రయోగంగా... వెరైటీ ప్రజంటేషన్‌గా అనిపించింది. ఇలా టైటిల్ నుంచి మొదలుకొని కవిత్వం – చిత్రీకరణ వరకు ఈ డాక్యుపోయెమ్ నలుగురు నడిచిన నలిగిన దారిలో నడవకుండా తనదైన కొత్త మార్గాన్ని, సరికొత్త గ్రామర్‌ను సృష్టించింది. కవిత్వానికి – అక్షరాల పరిధులను దాటేసిన దృశ్యాన్ని పొదిగి... దృశ్యాలకి కవిత్వం ఫ్రేమ్‌ను అందంగా అమర్చి ఓ Aesthetic నయా ప్రపంచాన్ని 16 నిమిషాల డాక్యుపోయెంగా సృష్టించినట్లుగా అనిపించింది.

ఆ లెక్కన "లైఫ్ @ చార్మినార్"ని రెండు కోణాలనుంచి విశ్లేషించడం – అర్థంచేసుకోవడం అనివార్యమవుతుంది. ఒకటేమో కవిత్వ కోణం! మరోటేమో డాక్యుమెంటరీ కోణం!

కవిత్వ కోణంలోనుంచి గమనిస్తే ఇది ఓ దీర్ఘకవిత...! ఈ 'దీర్ఘకవితా ప్రక్రియ' భారతీయ సాహిత్యంలో, తెలుగు సాహిత్యంలో చాలా ప్రాచీనమైనదే...! ఆ మాటకొస్తే, "మహాభారతం" కూడా దీర్ఘకవితే అనే అభిప్రాయం చాలామంది సాహితీ విమర్శకులలో ఉంది. అయితే, తెలుగు ఆధునిక కవిత్వంలో ప్రస్తుతం ఎంతో ప్రసిద్ధిపొందిన 'దీర్ఘకవిత'కు మాత్రం పునాదులు ఇంగ్లీష్ సాహిత్యంలోనే ఉన్నాయని చెప్పాలి. ఇంగ్లీష్ లిటరేచర్‌లో 'Long Poem' గా పిలుస్తున్న ఈ కవితా ప్రక్రియ మొదటిసారిగా 1855లో "Leaves of Grass" అనే కావ్యంతో వెలుగులోకి వచ్చింది. దీన్ని రచించిన కవి Walt Whitman ఈ 'Long Poem' కు ఆద్యుడుగా ఈ కావ్యంలోని "Song of myself" కవిత ద్వారా ప్రశంసలు పొందాడు. ఆ తర్వాత T.S.Eliot "The Wasteland" కావ్యాన్ని, Ezra Pound "Cantos" అనే కావ్యాన్ని ఈ దీర్ఘ కవితా విధానంలోనే రాసారు. ఇక, దీర్ఘకవితను రాసిన తొలికవయిత్రిగా Elizabeth Barret Browning తన "Aerora Leigh" కవితతో కొత్తదారులను వేసింది.

తెలుగులో కూడా ఎంతో మంది కవులు "దీర్ఘకవితా" ప్రక్రియలో కవితలు రాశారు. మహాకవి శ్రీశ్రీ ఓ చోట "నిన్నటి కావ్యం పద్దెనిమిది పర్వాలైతే, నేటి కావ్యం పద్దెనిమిది పేజీలే" అన్నారు! నిజానికి కవితల్లో సంక్షిప్తత, గాఢత మౌలికాంశాలు! కానీ కవి చెప్పదల్చుకున్న భావ వ్యూహాలని, ఆలోచనా సమూహాలను రెండు పేజీలలో చెప్పడం సరిపోదని ఫీల్ అయినపుదు, కవితా వస్తువులోని

విషయం విస్తృతమైందిగా భావించినపుడు పుట్టేదే ఈ "దీర్ఘకవిత" అని ఈ దీర్ఘకవితలను అధ్యయనం చేస్తే అర్థమవుతుంది. కుందుర్తి 'తెలంగాణ', సినారె 'మట్టి-మనిషి-ఆకాశం,' జూకంటి "వాస్కోడిగామా డాట్ కామ్", జూలూరు-"మూడవ గుణపాఠం", నగ్నముని 'కొయ్యగుర్రం' ఆచార్య ఎన్. గోపి 'జలగీతం', అద్దేపల్లి "మెరుపు పువ్వు", జింబో "హాజిర్‌హై", కృష్ణారావు "కిల్లారి", ఎండ్లూరి "కొత్త గబ్బిలం", పెన్నా "జీవనది", ఛాయారాజ్ 'శ్రీకాకుళం', శివారెడ్డి "అంతర్జనం"... ఇంకా ఎన్నో దీర్ఘ కవితలు అలాంటి భావ సంఘర్షణలోంచి పుట్టినవే...!

అయితే, తెలుగు ఆధునిక వచన కవిత్వోద్యమంలో కొత్త ఒరవడికి ఊపిరులూదుతున్న ఈ దీర్ఘ కవితా ప్రక్రియని ముందుకు తీస్కెళ్ళిన కవయిత్రులలో శీలాసుభద్రాదేవి వంటి ఒకరిద్దరు మినహా మరెవరూ లేకపోవడం గమనార్హం. ఆ లోటును పూరిస్తూ తెలుగు సాహిత్య ఆకాశంలోకి శ్రీలక్ష్మిగారు ఎక్కుపెట్టిన కవితాస్త్రమే ఈ "లైఫ్ @ చార్మినార్" అని భావించాలేమో!

దీర్ఘ కవితకు (1) ఏకసూత్రత (2) ఏక వస్త్వాశ్రయత (3) కవితా వస్తువులోని బహుముఖీన దర్శనం (4) వస్తువులోని గాఢత (5) జీవన సంఘర్షణ (6) పాఠకున్ని ఉన్మీలనం చేయగలిగే పదచిత్రాల పోహళింపు (7) కవితా పంక్తులలో అనుభూతుల కొనసాగింపు వంటి లక్షణాలు సార్వకాలీనతను, సర్వజనామోదాన్ని ఆపాదించిపెట్టే మూలాంశాలు...! "లైఫ్ @ చార్మినార్"ని ఈ లక్షణాల వెలుగులో గమనిస్తే, వీటిలో ఎక్కువ లక్షణాలను అద్భుతంగా ఆవిష్కరించిన దృశ్యం మనకు కనిపించకమానదు. ఈ దీర్ఘ కవితలో చార్మినార్‌ని- "విచ్చుకున్న దోసిలి"లా 'అర్థిస్తున్న భక్తుని'లా 'ఆధ్యాత్మిక జ్ఞాని'లా "నడిచే నుమాయిష్‌లా" "నేలపై పరుచుకున్న ఇంద్రధనుస్సులా", "ప్రేమ చిహ్నాల నెలవు"లా, "గుండె చప్పుళ్ళ కొలువు"లా, "చీకట్లోకి దూసుకెళ్తున్న వెలుగు బావుటా"లా, "అమ్మ భుజంపై చిన్నారికళ్ళలోని నిశ్చింతలా" "స్టాండ్ వేసిన బైక్ చక్రం"లా, "పావురాల జీవనోత్సాహం"లా బహురూపాలలో శ్రీలక్ష్మిగారు ఆవిష్కరించిన తీరేదీనికి ఉదాహరణ! అంతేగాక, ఈ కవిత అదే భావనని, మనకి కూడా అనుభవంలోకి తెస్తుంది. నిజమే! 'ఒకరి నడకను మరొకరు నడవలేరు. ఒకరి చూపుల్ని వేరొకరు చూడలేరు!' ఈదీర్ఘ కవితలో అలాంటి విశిష్ట ప్రయత్నమే జరిగింది.

లైఫ్ @ చార్మినార్‌ని డాక్యుమెంటరీ యాంగిల్‌లో విశ్లేషించడానికి ముందు అసలు world Cinemaలో డాక్యుమెంటరీల ప్రస్థానంపై ఓ విహంగ వీక్షణం అవసరం. డాక్యుమెంటరీ చలనచిత్రం అనేది సినిమా కళలోని ఓ విశిష్ట ప్రక్రియ! అయితే ఈ తరహా చలన చిత్రానికి 1926 వరకు ఓ పేరంటూ లేదు. స్కాటిష్ డాక్యుమెంటరీ ఫిలిమ్ మేకర్ అయిన జాన్ గ్రీర్‌సన్ ఓ సినిమాపై "న్యూయార్క్ సన్" పత్రికలో రివ్యూ రాస్తూ డాక్యుమెంటరీ అనే పదాన్ని తొలి సారిగా ఉపయోగించారని తెలుస్తుంది. అంతేకాక ఆయన డాక్యుమెంటరీ సినిమాకి ఉండాల్సిన కనీస సూత్రాలను కూడా

నిర్ధారించాడు. ఆయన ప్రకారం డాక్యుమెంటరీ సినిమా 1. వాస్తవ జీవితాన్ని సినిమా కోణం నుంచి ఆవిష్కరించే ప్రక్రియ. 2. ఫిక్షన్ సినిమాలోని కథ ప్రకారం నడిచే కాల్పనిక పాత్రలు సన్నివేశాలకన్నా ఒరిజనల్ వ్యక్తులు - దృశ్యాలే సజీవంగా ఉంటాయి. 3. వీటిలోని వ్యక్తులు - దృశ్యాలు నాటు (Raw) గా కనిపించినప్పటికి వాస్తవికత అదే కనుక డాక్యుమెంటరీకి వాస్తవికతే ప్రధానం కాని పైపైమెరుగులు, 'షో'లు కాదు.

సినిమా కళ 1895లో అగస్టే లూమియర్ - లూయీ లూమియర్ (వీరినే లూమియర్ బ్రదర్స్ అంటారు)ల ద్వారా ప్రపంచానికి పరిచయం అయిందనే విషయం మనకు తెలుసు. ఇప్పుడు బహుళ ప్రచారంలోఉన్న సినిమా అంతా 'ఫిక్షన్' తరహాకు చెందిందే! కాని, తొలినాళ్లలో సినిమా అంటే డాక్యుమెంటరీయే అని చెప్పాలి. లూమియర్ బ్రదర్స్ రూపొందించిన తొలితరం సినిమాలన్ని Short Films లేదా డాక్యుమెంటరీలే! అప్పటికి సినిమా టెక్నాలజీలో ఉన్న పరిమితుల దృష్ట్యా సినిమాలను 2-3 నిమిషాల వ్యవధికన్నా ఎక్కువగా తీసే అవకాశం ఉండేదికాదు. అందువల్ల అనివార్యంగా అవన్నీ వాస్తవిక దృశ్యాలు-సంఘటనల సమాహారంగానే ఉండేవి. ఆ లెక్కన ఇప్పుడు మనం చూస్తున్న ఫీచర్ ఫిలిమ్‌ల కన్నా ముందే డాక్యుమెంటరీలు పుట్టాయని అర్థమవుతుంది. అయితే వాటిని 1926 కన్నా ముందు Actuality Films అని పిలిచేవారు.

ఆ తర్వాత సినిమా టెక్నాలజీలో కెమెరా పరిజ్ఞానంలో వచ్చిన మార్పులు ఫుల్ లెన్త్ సినిమాలను సృష్టించాయి. అదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా డాక్యుమెంటరీ నిర్మాణంలో కూడా ఎన్నెన్నో మార్పులు వచ్చాయి. ప్రస్తుతం న్యూస్‌రీల్ ట్రెడిషన్‌గా, ఫ్యాక్చువల్ సినిమాలుగా మాత్రమే డాక్యుమెంటరీలు పరిమితమయ్యాయి. అయితే ఇవి నేడు ఎన్నెన్నో అవతారాలలో జనాదరణ పొందాయి. అలాంటి వాటిలో యానిమేటెడ్ డాక్యుమెంటరీలు, డాక్యూడ్రామా, డాక్యూ ఫిక్షన్, ట్రావెల్ డాక్యుమెంటరీ వంటివి ప్రముఖమైన 'Genre'లు. డాక్యుమెంటరీ ఫిలిమ్ మేకింగ్‌లోని ఇన్ని రకాల Genre లలో "లైఫ్ @ చార్మినార్ " పరిచయం చేస్తున్న డాక్యుపోయెమ్ ఓ సరికొత్త Genre అనాలేమో!?

డాక్యుమెంటరీ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఓ Intellectual Creative work గా ప్రత్యేక గుర్తింపును సాధించింది. అందుకే మీనింగ్ ఫుల్ సినిమా తీసిన ప్రతి డైరెక్టర్ ఏదో ఒక సందర్భంలో డాక్యుమెంటరీలను తీశారు. పూర్తిస్థాయి కథాచిత్రాలను నిర్మిస్తూనే, మరోవైపున తమలోని Intellectual Urge ను సంతృప్తిపరుచుకోవడానికి ఎన్నెన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి డాక్యుమెంటరీలను సృజించారు. సత్యజిత్ రే ('ది ఇన్నర్ ఐ', 'సిక్కిం', 'టాగోర్' వంటి డాక్యుమెంటరీలు) శ్యాం బెనగల్ (ఇండియన్ యూత్ : యాన్ ఎక్స్‌ప్లోరేషన్, 'సత్యజిత్ రే', 'నెహ్రూ' వంటివి) నుంచి అనురాగ్ కశ్యప్ ('బ్లాక్‌ఫ్రైడే' వంటి డాక్యుడ్రామా) వరకు అందరూ డాక్యుమెంటరీలను తీసినవారే.

ఆఖరికి ప్రపంచ ప్రసిద్ధ దర్శకుడు, అకీరా కురోసవ కూడా Dreams సీరీస్‌లోని "Crows" పేరిట డాక్యు పేటర్న్‌లో షార్ట్ ఫిలిమ్‌ను తీశారు. డాక్యుమెంటరీల చరిత్రలోనే ఓ వెరైటీ ప్రయోగంగా,

ఓ స్టాండర్డ్‌గా, ఓ గ్రామర్‌గా తర్వాత తరం ఫిలిమ్ మేకర్స్ దీన్ని పరిగణిస్తున్నారు. ప్రఖ్యాత
పెయింటర్ "స్టీవెన్ వ్యాన్ గో" పెయింటింగ్స్ దీని కథా వస్తువు! వ్యాన్ గో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను
తిలకిస్తున్న ఓ ఔత్సాహిక యువ పెయింటర్ కాస్త ఆ పెయింటింగ్ ప్రపంచంలోకి వెళ్ళడమే
కథాంశం. Magical Realism తరహాలో తెరకెక్కిన దీనికి 'ఇండియనా జోన్స్', 'స్టార్‌వార్స్' వంటి
మెగా సినిమాల దర్శకుడు జార్జి లూకాస్ స్పెషల్ ఎఫెక్ట్స్‌ని అందించారు. ఇక Vincent Van Gogh
పాత్రలో మరో ప్రముఖ దర్శకుడు Martin Scorcese నటించారు. ఈ కాంప్లెక్స్ కథాంశాన్ని
కురోసవా చిత్రీకరించిన విధానం... రియల్ పెయింటింగ్స్ లోని లొకేషన్స్‌ని, వ్యక్తులను "యానిమేట్"
చేసి నడిపించిన తీరు మనల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఇలా పెయింటింగ్ కళని–సినిమా కళని రెండింటిని
సమన్వయం చేసిన అద్భుత ప్రయోగంగా ఇది ఓ ప్రత్యేక స్థానాన్ని సాధించింది.

ఇలా ఎన్నెన్నో మలుపులు – అడ్వాన్స్‌మెంట్స్‌తో వస్తున్న డాక్యుమెంటరీ సినిమాల గమనంలో "లైఫ్ @ చార్మినార్" కూడా ఓ మైలురాయి అని చెప్పాలి. అందుకే కవిత్వ కళని – డాక్యుమెంటరీ కళని రెండింటిని సమన్వయంచేసి సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టిన డాక్యుపోయెంకి కర్తగా – క్రియేటర్‌గా శ్రీలక్ష్మిగారి విజన్‌ని అభినందించకుండా ఉండలేము.

అలాగే చారిత్రక వారసత్వ సంపదగా, హైదరాబాద్ నగర చిహ్నంగా, 420 ఏళ్లుగా జనజీవనంలో అంతర్భాగమైన చార్మినార్‌ని ప్రధాన వస్తువుగా తీసుకొని ఇప్పటికే వేలాది కథలు–కవితలు వచ్చాయి. చార్మినార్ నేపథ్యంగా వందలాది సినిమాలు–డాక్యుమెంటరీలు కూడా వచ్చాయి. కాని ఇవన్నీ చార్మినార్‌ను చారిత్రక కోణంనుంచో, నిర్మాణ వాస్తుశిల్పకోణంనుంచో, సాంస్కృతిక కళారూపంగానో మాత్రమే చూపించాయి.

కాని "లైఫ్ @ చార్మినార్" మాత్రం పేరులోనే స్పష్టంచేసినట్లు చార్మినార్ నీడలో, చార్మినార్ చుట్టూ అల్లుకొని ఉండే జనజీవనాన్ని, మానవ జీవన శైలిని 360డిగ్రీల కోణంలో ఆవిష్కరించిందని చెప్పాలి. వెలుగు నీడలలోని చార్మినార్ పరిసర జీవన దృశ్యాన్ని నిజాయితీతో నిక్కచ్చిగా తెరకెక్కించిన ఈ డాక్యుమెంటరీ, జాన్ గ్రీర్సన్ చెప్పిన 'Documentery is a Creative treatment of Actuality' అన్నమాటలకి తెరయెత్తు నిదర్శనంగా నిలిచింది.

రంజాన్ మాసం నాటి ఓ రోజులోని 24 గంటల జీవన చిత్రాన్ని ఈ డాక్యుపోయెం ఎలాంటి మెరుగులు – సొబగులు లేకుండా 'As-It-Is'గా ప్రజంట్ చేసింది. దాన్ని ప్రతిబింబిస్తూ ఈ బుక్ కవర్ డిజైనింగ్‌లో ముందు కవర్ తెలుపురంగులో, వెనుక కవర్ నలుపు రంగులో డిజైన్ చేసి రాత్రి పగలుల ద్వంద్వతని వ్యక్తీకరించారేమో అని నాకనిపిస్తుంది. అలాగే ఇది హిందూ–ముస్లిం సమైక్య భావనని, Cultural Diversity ని ఉన్నదున్నట్లుగా తెరకెక్కించింది. చార్మినార్ పరిసర ప్రాంతాలలోని ప్రజల జీవన పోరాటాన్ని–నమ్మకాలని, కష్టాలని–కన్నీళ్లని, ఆనందాలని–విషాదాలని, వినోదాలని–వేడుకలని, ఈ డాక్యుపోయెం తనకున్నంత పరిధిలో చక్కగా ఆవిష్కరించే ప్రయత్నం

చేసింది. మరో మాటల్లో చెప్పాలంటే This Docu-Poem is a celebration of Human Life in all its dimensions!" అలాగే Documentery Film is a motion picture intended to document some aspect of Reality అన్న మాటలకు నిలువుటద్దంలా నిలిచింది.

అయితే సినిమాలాంటి ఏ కళారూపానికైనా స్క్రిప్ట్-సినిమాటోగ్రఫీ-ఎడిటింగ్ అనేవి ప్రాణం! ప్రీ-ప్రొడక్షన్ స్టేజిలో స్క్రిప్ట్, ప్రొడక్షన్ దశలో సినిమాటోగ్రఫీ, పోస్ట్-ప్రొడక్షన్ స్టేజిలో ఎడిటింగ్- ఈ మూడు చక్కగా కుదిరితేనే సినిమాకానీ డాక్యుమెంటరీకాని గొప్పగా వస్తుంది. స్క్రిప్ట్‌లోని అంశాలను తెరపై చూపించగలిగే సినిమాటోగ్రఫీ టెక్నిక్, అలా తెరకెక్కించిన విజువల్స్‌లో ఎఫెక్టివ్‌గా అనిపించేవాటిని ఫైనలైజ్ చేయగలిగే ఎడిటింగ్ స్కిల్ సినిమాలో ప్రేక్షకుడి ఇన్‌వాల్వ్‌మెంట్‌ని పెంచుతుంది. ఈ డాక్యుపోయెంలో స్క్రిప్ట్- పోయెట్రిరూపంలో ఓ వెరైటీ ఫీలింగ్‌ని కలిగించడంలోనూ, ఎడిటింగ్- యాప్ట్ విజువల్స్‌ను ప్రజంట్‌చేయడంలోనూ సక్సెస్ అయ్యాయి. కాని సినిమాటోగ్రఫీ విషయంలో మరింత శ్రద్ధ తీసుకుంటే బాగుండేది. కెమెరా వర్క్‌లో చాలాచోట్ల షేకింగ్ రావడం.... బ్లర్ లుక్.. నైట్‌లైఫ్ విజువల్స్‌లో క్లారిటీ లేకపోవడం వంటివి ఈ డాక్యుపోయెంలోని విజువల్ ఈస్తటిక్స్‌ని ఇబ్బంది పెట్టాయి. ఫ్రేమింగ్, యాంగిల్స్‌వంటివి ఎంత బాగున్నప్పటికీ, క్వాలిటీ - క్లారిటీ పరమైన లోపాలు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తాయి. అయితే డాక్యుపోయెం కర్తలకు ఇది తొలిప్రయత్నమే కాబట్టి వారి తర్వాతి వెంచర్స్‌లో ఈ లోపాలను అధిగమిస్తారని ఆశించవచ్చు.

ఏదిఏమైనా, ఈ డాక్యుపోయెం స్వప్నాన్ని అందరూ మహిళలే సాకారం చేయడం ఓ విశేషం. ఒక అసాధారణ ప్రయత్నాన్ని అద్భుతంగా, అబ్బురపడేలా నిజంచేసిన సాయినవ్యత - సాయి హర్షిత - రేవతి చంద్రలేఖ - సుమశ్రీ... ఈ టీమ్‌నంతటిని నడిపించడమేకాక సర్వం తానే అయి మార్గ నిర్దేశనం చేసిన శ్రీలక్ష్మిగారు ప్రశంసనీయులు. ఫిలిమ్ మేకింగ్ వంటి క్లిష్టమైన రంగాలలో మహిళల పార్టిసిపేషన్ అతితక్కువ! కానీ ఈ డాక్యుపోయంకు అందరూ మహిళలే పనిచేయడం టీమ్‌గా కుదరడం ఓ వెలుగు సూచిక! మునుముందు ఈ టీం మరిన్ని సర్‌ప్రైజ్‌లను ఇవ్వాలని ఆకాంక్ష!

రండి!... కవిత్వ కాల్పనికత + దృశ్య వాస్తవికత కలిసి డాక్యుపోయెంగా అవతరించిన ఈ జీవన ప్రపంచంలోకి ఒకసారి తొంగిచూడండి. చార్మినార్ అంత ఎత్తుకు ఎదిగిన జీవన వైవిధ్యాన్ని కళ్ళతో తడిమి చూడండి... దివారాత్రులు - చీకటి వెలుగుల సయ్యాటలోని జీవన చిత్రాన్ని అక్షరాల గవాక్షాలగుండా వీక్షించండి... వేడుకలు - విషాదాల సందిగ్ధ సంభ్రమ సవ్వడులను మనసు చెవులతో వినండి... రండి...

**- మామిడి హరికృష్ణ**

# మనసుమాట

"Life can give you a hundred reasons to cry
But you can give to life a thousand reasons to smile"

నిజం... ఏడవటానికి కేవలం 100 కారణాలే వుండొచ్చు. కానీ నవ్వటానికి... నవ్విస్తూ బ్రతకటానికి 1000 కారణాలని... కారకాలని ఇవ్వలేమా...?! చేసే ప్రతి పనిపట్ల నిబద్ధత.. సృజనాత్మకత వుంటే చాలు... అదే మనని విజేతగా ... బోలెడు ప్రశంసల్ని తెచ్చిపెడ్తుందని నేను పరిపూర్ణంగా నమ్ముతాను.

నేను పెరిగింది... చదివింది... ఆడిందీ పాడిందీ అంతా మా నిజామాబాద్ జిల్లాలోనే... ఆసియా ఖండంలోనే పేరెన్నికగన్న పంచదార కర్మాగారం వున్న బోధన్‌లోనే నేను పుట్టాను... ప్రభుత్వ పాఠశాలల్లో నా బాల్యమంతా అటు సాహిత్యం... ఇటు ఆటలు... అటు చదువుగా సాగింది - గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌కు చేరుకున్న "ఇందూర్ భారతి", సాహితీ స్రష్ట కీ. శే॥ సైబ పరంధాములు, అహల్యమ్మ, కవి భాస్కరుడు నాళేశ్వరం శంకరం సుభద్ర గార్లు నాకు వెన్నుదన్నుగా నిలిచారు. అమ్మానాన్న సరోజిని-శ్యామసుందర్‌రావు, శ్రీవారు నాగేశ్వరరావు, అన్నదమ్ములు చంద్రశేఖర్-సుదా, సుబ్బారావు-బిందు, మహేశ్వరరావు-మాధవిల ఆత్మీయత, అత్తయ్య హనుమాయమ్మ ఆశీస్సులు మరువలేనివి... అన్నింటికి మించి 102 సంవత్సరాల మా తాతయ్య జనార్ధన్ రావు గారి అవ్యాజ ప్రేమనే నా ఈ గుర్తింపుకు కారణమనుకుంటా.

నా జీవన ప్రస్థానంలో ఎన్నెన్నో మెరుపులు... మరెన్నో మలుపులు! చిత్రమేమిటంటే మా జిల్లాలో ఫస్ట్ డాక్యుమెంటరి డిచ్‌పల్లి రామాలయం మీద తీస్తే వాయిస్ ఓవర్ నేనే ఇచ్చాను. నా కథ "రిక్షావాడు"ని గురుదేవులు సైబగారు, రూపశిల్పి బ్రహ్మయ్యగారు టెలీఫిల్మ్‌గా తీసినప్పటికీ పూర్తి చేయలేకపోయారు. సైబగారు దాన్ని తల్చుకొని దిగులుపడు తుండేవారు. బహుశా ఇది వారికి నివాళిగా భావిస్తున్నాను.

ఈ డాక్యుమెంటరీ తీయటానికి స్ఫూర్తిని కల్గించిన నాతోటి నంది టి.వి. అవార్డు జ్యూరీమెంబర్స్ (2009) ఆ జ్యూరీలో అవకాశం కల్గించి, ఈ పుస్తక ప్రచురణకు ఆర్థికంగా సహకరించిన సౌహార్ద్రశీలి పార్థసారధిగారికి, మా వదినమ్మ శోభగారికి, ఎఫ్.డి.సి. సిబ్బందికి, "లైఫ్ @ చార్మినార్"ని మేము ఎన్ని జీవన కోణాల్లో చూపించామో అంతకు రెట్టింపుగా మా జీవన కోణాల్ని "జిందగీ" ద్వారా అక్షరాల్లో ఆవిష్కరించిన "మా నమస్తే తెలంగాణ" పెద్దన్నలందరికీ, చక్కటి పబ్లిసిటీ ద్వారా మా డాక్యుమెంటరీ 'పోయెం' ప్రజల చేరువకి తీసుకెళ్ళిన www.navatarangam.com, www.dearcinema.com వారికి, చక్కటి పబ్లిసిటీ ఇచ్చిన వివిధ పత్రికా మిత్రులకి, వనితా ఛానల్ వారికి, ముఖ్యంగా కరీంనగర్ ఫిల్మ్‌సొసైటీ సభ్యులందరికి, ఆత్మీయమిత్రులు పొన్నేరి సురేష్‌కుమార్ గార్కి రవిచంద్ర గార్కి మాడిశెట్టి గోపాల్, గాజోజు నాగభూషణం, వెంకన్నకి, జుబేర్‌భాయ్, డా॥ పత్తిపాక మోహన్, జి. నర్సింహస్వామి, డి. చక్రపాణి, కుమారి, ఎం. జావెద్

హుస్సేన్‌కి అధ్యాత్మిక పెద్దలు ఘంటా నారాయణస్వామి, ముక్కాదేవేందర్ గుప్తా, మూఢ నాగభూషణం గుప్తా, సాహితీ బంధువు అమృతలత గార్లకు ముకుళిత హస్తాలతో ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

ఫిల్మ్ మేకింగ్‌లో మహిళల పాత్ర తక్కువ. ఎంతో మంది మహిళలు ఎన్నెన్నో రంగాల్లో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తూ ప్రశంసలు అందుకుంటున్న ప్రస్తుత కాలంలో ఈ రంగంలో కూడా మరింత మంది మహిళలు రావాలని ఆశిస్తూ మా టీంకు స్పెషల్ జ్యూరీ అవార్డునిచ్చి ప్రోత్సహించిన న్యాయనిర్ణేతలు శ్రీయుతులు రాంమోహన్ నాయుడి గార్కి , కె.పి. అశోక్ కుమార్ గారికి వినమ్ర నమస్సులు.

ఎపుడూ నా ప్రగతిని కాంక్షించే శ్రీమతి నిర్మలా రాజేంద్రమోహన్ గోనెల గారు, కె.వి. సత్యనారాయణ గారు, వీరమాచినేని ప్రసాద్ గారు, 'యోజన' బాలకృష్ణ గారు, 'మిసిమి' అశ్వినీ కుమార్ గారు, 'ప్రస్థానం' వరప్రసాద్ గారికి, 'పొద్దు' బైసరాందాస్ గారికి గౌరవ వందనం.

నా ప్రతీ అడుగునీ ప్రోత్సహిస్తూ, నాకు నిరంతర స్ఫూర్తిగా నిలుస్తున్న 'బ్నిం'గారికి ఆత్మీయవందనం.

నా ప్రతి విజయాన్ని గుర్తిస్తూ అభినందించే సి.హెచ్. విద్యాసాగర్ రావు గారికి, పొన్నం ప్రభాకర్ గారికి, మధుయాష్కి గౌడ్ గారికి సర్వదా కృతజ్ఞురాలిని.

నా ప్రతి కార్యక్రమం వెనుకా నా ఆకాశవాణి కొలీగ్స్ ఎప్పుడూ ప్రోత్సాహం ఇస్తున్నందుకు వారందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను... అందంగా ముద్రించి ఇచ్చిన అంకుశ్ చిన్నా గారికి, అద్భుతంగా ఎడిట్ చేసిన మా సుమశ్రీకి - రేవతి చంద్రలేఖ పొన్నంకు, చక్కటి సలహాలిచ్చి అందంగా పుస్తక ముద్రణలోనూ, ముందు మాటతోనూ, మనస్సును దోచుకొని పుస్తకాన్ని దాచుకొనే స్థాయికి తీసుకెళ్లిన 'నడుస్తున్న గూగుల్' మామిడి హరికృష్ణగార్కి సర్వదా కృతజ్ఞురాలిని. కవర్ పేజిని, పోస్టర్స్‌ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన సూర్య దుబే గార్కి ధన్యవాదాలు. నా పనుల వత్తిడి దృష్ట్యా ఈ పుస్తక ప్రచురణకోసం సమయం కేటాయించలేకపోయినా అన్నీ తామేయై చూసుకున్న నా పిల్లలు సాయి నవ్యత, సాయి హర్షితలకు ఆశీస్సులు.

"స్నేహం చేయదలుచుకుంటే ప్రకృతంత పెద్దది... ప్రేమించదలచుకుంటే జీవితమంత గొప్పది మరోటి లేదంటారు". కాబట్టి జీవితాన్ని జీవంతో గడపాలనుకుంటూ భవిష్యత్తులో లైఫ్ సీరీస్‌తో మేం తీయబోయే డాక్యుమెంటరీలు కూడా అందర్నీ అలరిస్తాయని భావిస్తున్నాం. నా "అలల వాన" కవితా సంపుటిని ఆశీర్వదించినట్లుగా, ఈ "లైఫ్@ చార్మినార్"ని కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నా.

"అలలవాన"ను అమ్మనాన్న షష్టిపూర్తికి వేశాము. ఈ పుస్తకాన్ని అమ్మానాన్న వివాహ స్వర్ణోత్సవ కానుకగా ఇవ్వడం ఎంతో సంతోషాన్నిస్తుంది.

'సాధించే సత్తా వుంటే సమరం ఒక సయ్యాట

తలవంచుకు రావాల్సిందే ప్రతి విజయం మనవెంట' అనుకుంటూ సాగటమే నా ఈ ప్రస్థానం.


ఎందరో మహానుభావులు అందరికి వందనాలు...

- అయినంపూడి శ్రీలక్ష్మి

# లైఫ్ @ చార్మినార్

వేన వేల స్వప్నాల
లక్షలాది ఆకాంక్షల
వెలుగునీడలకు సంకేతం
నాలుగు వందల తరాల జీవితం
చార్మినార్

ఒక మినార్ - చారిత్రక వారసత్వం
ఒక మినార్ - సమకాలీన జీవనం
ఒక మినార్ - పర్యాటక చేతనం
ఒక మినార్ - వ్యధాభరిత హృదయం
నాలుగు దిక్కులు ఒకే చోట కలుస్తున్న
సజీవ దృశ్యం చార్మినార్



చార్మినార్ -
నాకు విచ్చుకున్న దోసిలిలా అనిపిస్తుంది
దేవుణ్ణి -
ఏ కోరికకోసమో అర్థిస్తున్న భక్తునిలా అనిపిస్తుంది

హైదరాబాద్ నేలకాస్తా
చార్మినార్‌ని చేతులుగా చేసుకొని
ఏ ఉన్నతాకాశం నుంచో వస్తున్న
శాంతి సందేశాన్ని స్వీకరిస్తున్న
ఆధ్యాత్మిక జ్ఞానిలా అనిపిస్తుంది

నిట్టనిలువుగా నిలబడి
నేల దేహంలో నిక్షిప్తమైన
కోట్లాది గుండెలకు
ఓదార్పునిస్తున్నట్టుగా అనిపిస్తుంది
నాలుగు దిక్కులా రోడ్లు వేసుకున్న చార్మినార్
మనుషుల రక్తాల్లో
ఏ సమున్నత మానవతావాదాన్నో
ప్రవహింపచేస్తున్నట్టుగా అనిపిస్తుంది.

* * *




చార్మినార్ -
ఉదయరాత్రుల మధ్య మాగన్ను సంచలనం
రెండు ప్రపంచాల మధ్య మెలుకువ స్వప్నం
ఆదాబ్ -నమస్తేలను ఏకం చేసే జాగృత కేతనం
మెరుపు కిరణాలను - అంధకారం వన్నెలను
కలిపి కుట్టేస్తున్న ఓ అనుభవ దారం
కొత్త అనుభూతుల ద్వారం.....

* * *

రంజాన్ మాసపు సాయంత్రమిది....
నగరమంతటా
తెల్ల మఖమల్‌లా పరుచుకున్న చలి పవనం
చార్మినార్‌కు
వందల మీటర్ల దూరంలోనే "గాయబ్" అవుతుంది.
'షాదాబ్' బిర్యానీ సొగసైన పరిమళాలు
హైకోర్టు - గుల్జార్ హౌస్ వరకు
గాలిలో తేలివస్తాయి.


ఇక చార్మినార్‌కు వెళ్ళే బజార్ బజార్ అంతా
దుపట్టాలుగా...లెదర్ గూడ్స్ గా... షేర్వాణీలుగా....
కొత్త బట్టలుగా...గిఫ్ట్ ఆర్టికల్స్‌గా...మారుతుంది.



చార్మినార్ ముందర జనసాగరం
అలలు అలలుగా ఎగిసి పడుతున్నట్టు ఉంటుంది
'హరేక్ మాల్ బీస్' అరుపులు
'దేనేకీ బాత్ బోలో భాయ్' బుజ్జగింపులు
అన్నీ కలసి
ఏ అజ్ఞాత సంగీతకారుడో కూర్చిన
మనుష్య సంగీతాన్ని వినిపిస్తుంటాయి

తలపైకెత్తి చూస్తే చాలు....
చేతికందేంత ఎత్తులో
వెలుగుల వరుసలతో సీరియల్ బల్బులు
'జమీన్ పర్ తారే ఆగయే' అనిపిస్తాయి

జనం కళ్ళల్లోకి తొంగిచూస్తే చాలు....
ఆకాశంలోని నక్షత్రాలన్నీ కూడబలుక్కొని
చార్మినార్ పరిసరాల్లోకి
ఏ ఫ్లైయింగ్ సాసర్ లేకుండానే
దిగివచ్చినట్లనిపిస్తాయి.



తోపుడు బళ్ళ మీద ఎన్నెన్నో వస్తువులు
జిగేల్ మనే విద్యుద్దీపాల మధ్య
జిలిబిలిగా కనిపిస్తాయి....

* * *

ఈ నేల అంతటా అడుగుజాడలే....
జనాలందరి హృదయముద్రలే...
వెళ్ళే వాళ్ళు - తిరిగి వచ్చే వాళ్ళు
ఉరుకులు - పరుగుల ఆరాటాల కళ్ళు
క్షణకాలమైనా నిలవని చంచలిత కాళ్ళు....

మనుషులు నడిచేందుకే దారిలేదు...
అయితేనేం -
బైక్‌లు - ఆటోలు కూడా
యథేచ్ఛగా పరుగెడుతూ ఉంటాయి
ఆ వైశాల్యం రోడ్డుది కాదు....
ప్రజల గుండెల్లోనిది...

రోడ్లు ఇరుకే కావచ్చు
కానీ -
ఇక్కడి జనాల హృదయాలు మాత్రం అనంతమే!

* * *



ఏనడక ఎటువైపో...
ఏకంటి దృష్టి ఏ వస్తువు వైపో...
ఏ చేతి స్పర్శ ఏ ఆభరణాల కోసమో...
తెలీదుకానీ -
ప్రతి మనిషి తపన మాత్రం
పండుగపూట తమవారిని.....తమ ఇంటిని
కొత్త వస్తువులతో 'ఖుష్' చెయ్యాలనేదే!

అలా ఈ రాత్రి చార్మినార్
ఓ నడిచే నుమాయిష్‌లా ఉంది

* * *

50 పర్సెంట్ సేల్ బోర్డులు-పిలుస్తున్న షోకేస్ బొమ్మలు
రంగు రంగుల టోపీలు-రకరకాల హ్యాండ్ బ్యాగ్‌లు
వైవిధ్యమైన గాజులు-రబ్బరు బ్యాండ్‌లు
సెంట్ సీసాలు-గడియారాలు
టీ షర్ట్‌లు-సూట్లు-'సాట్‌వాలా' అమ్మకాలు
కలర్ ఫుల్ ఛష్మే-వండర్ ఫుల్ నగ్మే....



అలా ఈ క్షణాన చార్మినార్
నేలపై పరుచుకున్న ఇంద్రధనస్సులా ఉంది

* * *


ఓపెన్ ఎయిర్‌లో హ్యాంగర్‌లకు వేలాడదీసిన డ్రెస్‌లు
కళ్ళముందే కదిలిపోతున్న వెండి పట్టీలు...
అన్నీ -
బురఖాలు-చీరకొంగులనే తేడా లేకుండా
అందరినీ ఆహ్వానిస్తాయి

సాత్ రంగ్‌కే సప్నే కాస్తా
ఇక్కడి దుకాణాల గోడలపై ప్రత్యక్షమౌతాయి

చెప్పులు అమ్మేవాళ్ళకైనా - చద్దర్లు అమ్మే వాళ్ళకైనా
చాయ్ తాగే వాళ్ళకైనా - ఛమ్ ఛమ్ తినేవాళ్ళకైనా
సెల్‌ఫోన్ ఇప్పుడు సబ్‌కా దోస్త్....

ఈ చీకట్లో చార్మినార్
ప్రేమ చిహ్నాల నెలవులా ఉంది
గుండె చప్పుళ్ళ కొలువులా ఉంది

* * *



తెల్ల గుబురు గడ్డాలతో
పండిపోయిన వృద్ధ సాహెబ్‌లు...
చద్దర్ల మడతల్లోంచి జారిపోతున్న
చిన్నారి చేతుల బాలలు...
రెండు వైవిధ్యాలకు సాక్షులుగా నిలుస్తారు
ఇక్కడ పాదం మోపగానే
పెదాలు మాత్రమే కాదు
కళ్ళు కూడా నవ్వుతాయి


దోస్తులు - రిష్తేదార్‌లు - పతీపత్ని
మీరెవరైనా... దేనికోసం వచ్చినా...
మీక్కావల్సినవన్నీ ఇక్కడ దొరుకుతాయి



అయితే ఇక్కడే
ప్రాచీన భవనాల శిలాజాలు
గత కాలపు జీవితాల శిధిలాలు కూడా పలకరిస్తాయి
ఓ ప్రక్క శివపార్వతీ విఘ్నేశ్వరుల 'హ్యాపీ ఫ్యామిలీ'
మరోపక్క గతితప్పిన మతితప్పిన 'బతుకు జావళీ'


అయితేనేం -
ఎవరినడకలు వారివి
ఒకరి నడకను మరొకరు నడవలేరు
ఒకరి చూపుల్ని వేరొకరు చూడలేరు

ఇప్పుడు ఇక్కడి దృశ్యం -
జనాలంతా తలలపై చార్మినార్‌ను మోస్తున్నట్లుగా ఉంది




* * *

రాళ్ళు... రంగుల రాళ్ళు - బీడ్స్ హారాలు
చార్మినార్ చేరువలోని షాపుల చెట్లకు
వ్రేలాడుతున్న ద్రాక్ష పళ్ళలా ఉంటాయి
సౌందర్యాలంకరణ అంతా ఇక్కడ
ఏడు వర్ణాల్లో మాత్రమే కాదు
ఏడు వేల రంగుల్లో దర్శనమిస్తుంది



టెడ్డీ బేర్‌లు - సాఫ్ట్‌టాయ్స్
వాటిని తయారుచేసిన
అనామక హస్తాలని గుర్తుచేస్తాయ్
వెండి నగిషీల పెట్టెలు - ఖురాన్ ప్రవచనాలు
ఎంతో మంది గుర్తుతెలియని
నగిషీకారుల చేతులని స్ఫురణకు తెస్తాయి



వారి గీత మారకపోయినా -
వారి చేతుల్లోని రేఖలు మాత్రం
ఇక్కడి వస్తువులపై
లతలుగా-చిత్రాలుగా-ఇత్తడి ముద్రలుగా
ట్రాన్స్‌ఫర్ అయ్యాయనిపిస్తాయి

* * *

కాల పరీక్షకు నిలిచి గెలిచిన చార్మినార్
కాలాన్ని ఇంకా కొలుస్తూనే ఉంది

ఈ సందడి రాత్రి చార్మినార్
చీకట్లోకి దూసుకెళ్తున్న వెలుగు బావుటాలా ఉంది

* * *

పానీపూరీ-భేల్‌పూరీ
బొప్పాయి - సేపులు - సీతాఫలాలు
రారమ్మని నోరూరిస్తాయి

గుత్తులు గుత్తులుగా పరుచుకున్న ప్లాస్టిక్ పూలు కాస్తా
చార్మినార్ ముందు
ఓ ఆర్టిఫీషియల్ 'బగీచాను' తయారుచేస్తాయి.

అయినా -
రెండు భుజాలకి కొత్త బ్యాగ్‌లు వేసుకున్న
సగటు జీవి జీవిత భారాన్ని తగ్గించవు

* * *

గాజులు..... గాజుగాజులు... మెటల్ గాజులు...
ముత్యాల గాజులు...రాళ్ళ గాజులు...
ఎక్కడచూసినా రంగుల గాజులే
డిజైన్ డిజైన్‌లుగా...
నగిషీలు నగిషీలుగా....
గాజుల దొంతరల్లో..
ఏ స్త్రీత్వమో తననుతాను అన్వేషించుకుంటూ ఉంటుంది

ఇప్పుడు చార్మినార్
హైదరాబాద్ నగరం చేయికి తొడిగిన
నగిషీల గాజులా అనిపిస్తుంది

* * *




బారులు తీరిన షాపులు
పిల్లలు - స్త్రీల కోసం డిఫరెంట్ స్టైల్లో వస్త్రాలు
ఆపక్కనే దోస్తుల చెట్టా పట్టాల ప్రయాణాలు
అద్దాల దుకాణాల్లో ఎలక్ట్రిక్ లైట్ల మెరుపులు
చిన్న పిల్లోడిలో ఆశ్చర్యాల విరుపులు

ఇన్ని కాంతుల మధ్య
జీవితంలో వెలుగును కోల్పోయిన పేదరికం

ఇన్ని మెరుపుల మధ్య
గాలిలో మాడిపోయిన బల్బుల దారిద్ర్యం

చార్మినార్ ఇపుడు
ఏం జరుగుతుందో అర్థంకాని కుర్రాడిలా ఉంది...

* * *



జీవితం ఓ యాత్ర
మనుషులంతా యాత్రికులు
నచ్చిన వాటికోసం - తమకు నచ్చేవాటికోసం
అన్వేషిస్తూనే ఉంటారు
అమాయకపు కళ్ళకి ఆశల రంగులద్ది
వెతుకుతూనే ఉంటారు

ఇక్కడి-
నగిషీల కుంకుమ భరిణలు
ఎపుడెపుడు దేవుని గదిలోకి వెళదామా
అని ఆరాటపడుతూ ఉంటాయి

రకరకాల జూకాలు-
అందమైన అమ్మాయిల చెవులను
ఎప్పుడెక్కి కూర్చుందామా అని ఎదురుచూస్తూ ఉంటాయి

మరోవైపున-
కర్ఛీఫ్‌లపై సైతం అందమైన పూలు పూయించే బడుగు జీవులు
తమ జీవితాల్లో మాత్రం వికాసానికి నోచుకోరు

ఎంతకీ నిండని జోలెలు - దీనమైన చూపులు
'అల్లా హీ దేగా' అనే స్వాంతన గీతాలుగా మారుతాయి

కాలినడకల డిసెన్సిటివిటీ
వాహన పరుగుల చాకచక్యాల మధ్య
నేలను కౌగిలించుకున్న వైకల్యం
ఖాళీ డబ్బాలో రూపాయి బిళ్ళకోసం
మోచేతులపై ప్రాకులాడుతూనే ఉంటుంది
డబ్బాను ఎంత జరిపినా
బ్రతుకు మాత్రం అరంగుళం కూడా జరగదు



నిన్నటితరం నిరాశలు
నేటితరం ఆశలు
కలర్‌ఫుల్ వస్త్రాలుగా
ఒకేచోట వ్రేళ్ళాడుతూ కనిపిస్తాయి

అయినా ఈ రాత్రి చార్మినార్ -
అమ్మ భుజంపై చిన్నారి కళ్ళలోని నిశ్చింతలా ఉంది.

* * *

రాత్రి వెళుతూ వెళుతూ
ఎన్నో చేదు - తీపి జ్ఞాపకాలను వదిలి వెళ్ళింది

విషాదాలను ఊడ్చివేయాలి
సంతోషాలను ఒక్కచోట పేర్చాలి...
గతంలోని దు:ఖాలన్నింటినీ చెత్తబండిలోకి ఎక్కించాలి
వర్తమానంలోనైనా కొత్త ఆనందాలకోసం
దారిని శుభ్రం చేయాలి....



పొద్దున్నే చార్మినార్ జీవనం
స్టాండ్ వేసిన బైక్ చక్రంలా ఉంటుంది

* * *

బతుకు పోరాటం కోసం
మళ్ళీ జనసంచారం మొదలు అవుతుంది...
బాధ్యతలను క్యారీబ్యాగ్‌లో వేసుకొని
పాదయాత్ర మొదలెడతారు

నిత్యజీవితం కాస్తా
వాహనాలు వాహనాలుగా రోడ్డెక్కుతుంది
కాలినడక - సైకిల్ - స్కూటర్ - ఆటో...
ఏదైనా
చలనమే జీవన సంగీతం
కదలికే బ్రతుకు మాధుర్యం

అరటిపళ్ళ బండిని ఎంతనెట్టుకుంటూ వెళ్ళినా
ఆరాటమే కానీ ఊరట దొరకదు

అయినా -
బిక్షగాడి లక్ష్యరహిత చూపులకి
ఓ మనిషి ప్రార్థన అండగా నిలుస్తుంది

* * *



వ్యాధులుంటేనేం - పేదలైతేనేం
చార్మినార్ నీడలోని వారంతా
ఆజన్మ నేస్తాలే అని చెపుతుంది
మనిషికి మనిషే తోడని చేతల్లో చూపుతుంది

ఈ వేకువజామున చార్మినార్ -
తల్లి చంకలో నిరంధిగా నిద్రిస్తున్న చంటి పాపలా ఉంది

* * *

చార్మినార్ నీడలో
రెండు భిన్న వర్ణాలు - రెండు విభిన్న ధృవాలు
కాషాయ బావుటాలు - ఆకుపచ్చ పతాకాలు
ఓ గొప్ప సహజీవన సౌందర్యాన్ని
రెపరెపలాడుతూ ప్రకటిస్తాయి

ఆ పక్కే -
అరటిపళ్ళు - బత్తాయిలు - సేపులు - ద్రాక్షలు...
చార్మినార్ ఓ పండ్లతోట అవుతుంది

* * *



తోపుడు బళ్ళపై కప్పి ఉన్న
బ్లూటార్పలిన్ పై నుంచి చార్మినార్
సముద్రంలోంచి పొడుచుకొచ్చిన పర్వతంలా ఉంటుంది

దిక్కులు కలుస్తాయో లేదో తెలీదు కానీ
ఇక్కడ -
మిలన్ చాయ్ - జోరున్న కొత్త పెప్పీ - చైనీస్ ఫుడ్
ప్రక్కప్రక్కనే సహవాసం చేస్తుంటాయి

ఫుట్‌పాత్‌లపై విగతజీవులు కొందరు
తూర్పు తెల్లారినా ఇంకా తెల్లారని
తమ బతుకు పుస్తకంలోంచి
మరోపేజీని చించేస్తారు..

* * *

ఎదురుగా మక్కా మసీద్
దాని ముందు పావురాల రెక్కల సవ్వడి
ఒకప్పుడు
ఈ మెట్లమీద ఒక్క పావురమే తిరుగాడేది
ఇక్కడ
తిండి గింజలు దొరుకుతాయని తెలిసిందో ఏమో
ఎక్కడెక్కడి నుంచో ఒక్కటొక్కటిగా
పావురాలు ఎగిరొచ్చాయి



ఇప్పుడు మెట్ల మీద.... చెరువులో
అంతటా పావురాలే
నగరం నిండా విస్తరించిన మనుషుల్లాగా...

ఈ ఉదయాన్నే చార్మినార్ -
పావురాల జీవనోత్సాహంలా ఉంది

* * *

పక్షి - జంతువు - మనిషి
మూడు జాతుల సామూహిక జీవనం
ఇక్కడి జీవితాదర్శం

ఎగిరెగిరి వాలుతున్న పావురాల మధ్య నుంచి
తెల్లపావురం ఒకటి
వీపుపై స్కూలు బ్యాగ్‌తో బడికి నడిచివెళ్తూంటుంది

ఈ వేళ చార్మినార్ -
ఆటలాడే ఆనందంలో
తండ్రిచేయి విడిచిన పిల్లాడి అయోమయంలోని
అమాయకత్వంలా ఉంది...



అయితేనేం -
చార్మినార్ అంటే ఓ ధైర్యం
చార్మినార్ అంటే ఓ స్ఫూర్తి
చార్మినార్ అంటే ఓ జీవనార్తి


* * *

ఆస్తులు లేకున్నా - హస్తాలు లేకున్నా
జాయ్ ఆఫ్ లివింగ్‌కీ
ఆర్ట్ ఆఫ్ లవింగ్‌కీ మాత్రం
కొరతలేదిక్కడ

చింపిరి జుత్తయితేనేం
చిన్నారి వినోదానికి చిన్నత్రాడే ఆలంబన ఇక్కడ...

అమ్మా - ఆకలి అందరికీ ఒక్కటే
రోడ్డయినా - చార్మినార్ నీడైనా
అమ్మ కొంగుచాటులోని బేల కళ్ళ ఆకాంక్ష ఒక్కటే

ఇప్పుడు చార్మినార్ -
ఎన్నెన్నో అనుభవాలతో
తలంతా నెరసిన పెద్దమనిషిలా ఉంది





నీకు -నాకు -మనందరికీ
చార్మినార్ ఓ చారిత్రక నిర్మాణం

కానీ కొందరికది కేవలం నీడ - తలదాచుకొనే చోటు
పొద్దున్నే
ఇడ్లీ తినడానికి ఉపయోగపడే హోటల్
బిక్షపాత్రలోకి
నాలుగు రూపాయలు నడిచొచ్చే స్పాట్

ఈ నిండు వెలుగులో చార్మినార్ -
మానవ జీవితంలోని ఎన్నెన్నో వృత్తాలు
ఇతివృత్తాల గమనంలా ఉంటుంది.
నలువైపులా కదలాడే బతుకుచిత్రంలా ఉంటుంది.

అన్నింటినీ మించి -
భూమిపై నిలువుగా ఎదిగిన
మానవుడి ఆత్మ విశ్వాసంలా ఉంటుంది.


* * *


చరిత్రమెట్లెక్కి
శిథిల అనుభవాలు - చీకటి జ్ఞాపకాల గుండా
వెలుగు జాడలవైపు
మనిషి చేస్తున్న ప్రస్థానమే - చార్మినార్
వెలుగు చీకట్లలోని
చిరునవ్వుల జీవనేచ్ఛ - చార్మినార్

ఓ పచ్చని స్వప్నం
ఓ స్వేచ్ఛా విహంగం
ఓ విస్తార జీవనం
ఓ నిరంతర ప్రయాణం - చార్మినార్

* * *

గది గదిని అన్వేషిస్తూ ఉంటాను
మది మదిని పరికిస్తూ ఉంటాను కదా...
ఇప్పుడు చార్మినార్...
హిందూ భజనలు - ఇస్లాం నమాజ్‌లు జరిపే
రెండు ప్రపంచాల సంగమం
పంచభూతాల సంబరం





రాశిపోసిన ప్రాచీన నాణేల
చిరస్మరణీయ జ్ఞాపకం
సమానత్వపు సంకేతం
మానవత్వపు పరిమళం... చార్మినార్

* * *

ఇప్పుడు చార్మినార్ అంటే -
చిరిగిన బ్రతుకుల్లోని సెలబ్రేషన్
మెరుపుల లైఫుల్లోని ఫ్రస్ట్రేషన్
వేకువలోని చీకటి
రాత్రిలోని వెలుతురు
చరిత్రలోని ప్రస్తుతం
వర్తమానంలోని గతం
కన్నీటిలోని ఆనందం
సంతోషంలోని దుఃఖం

చార్మినార్ -
నగరం చెక్కిలిపై ఘనీభవించిన కన్నీటి చారిక
నగరం కన్నుల్లో విరిసిన కొత్త ఆశల గీతిక

(నమస్తే తెలంగాణ, దినపత్రిక జిందగీలో, 2011 జూలై 5న ప్రచురితం)

## ఫ్యామిలీ ఫిలిమ్


జిందగీ

ఫ్యామిలీ ఫిలిమ్

'వృత్తిపై నిబద్ధత ఒక ఆదర్శం!
'ప్రవృత్తిపై ప్రేమ ఒక ప్రేరణ!!
అందుకే వృత్తి - ప్రవృత్తి
రెండిట విజయం సాధిస్తే
పరిపూర్ణమైన వ్యక్తిత్వం సొంతం చేసుకున్నట్టే
'క్రియేటివిటీ'కి కొలమానం దొరికినట్లే!
ఆ సృజనాత్మక విజయానికి
పేరేదైనా ఆ దృశ్యం
వీక్షకులకు ఆనందాన్నిస్తుంది!!
ఉద్యోగం చేస్తున్న అయినంపూడి
శ్రీలక్ష్మి అండ్ డాటర్స్ సాధించిన ఈ
విజయం కూడా అలాంటిదే

"ఒక మినార్ చారిత్రక వారసత్వం
ఒక మినార్ సమకాలీన జీవనం
ఒక మినార్ పర్యాటక చేతనం
ఒక మినార్ వ్యధాభరిత హృదయం"
అదీ చార్మినార్ అంటే!!

కాని 'లైఫ్ ఎట్ చార్మినార్' ఏంటి? అక్కడి ప్రత్యేక జీవన వైవిధ్యాన్ని చూపించిన ఒక డాక్యుమెంటరీ. జాతీయస్థాయిలో జరిగే 'పాలపిట్ట అవార్డు'ను ప్రత్యేకంగా ఇంటికి తీసుకొచ్చిన సృజనాత్మక షార్ట్‌ఫిల్మ్. తరచి చూస్తే ఈ డాక్యుమెంటరీకి చార్మినార్‌కున్నన్ని ప్రత్యేకతలు కనిపిస్తాయి. ఇది డాక్యుపోయెమ్. ప్రపంచంలోనే ఈ తరహా డాక్యుమెంటరీ ఇంతకుముందు రాలేదు. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం నుంచి కెమెరాపర్సన్, ప్రొడ్యూసర్ వరకు అందరూ మహిళలే పని చేయడం మరో విశేషం. ఒక ప్రయోగానికి శుభపరిణామం కూడా.

## దృశ్యమాలిక

ఈ డాక్యుపొయెమ్ గురించి రెండు ముక్కల్లో చెప్పలేం. సరదాగానో, బహుమతి కోసమో తీసింది కాదు. అలాగని ఉద్వేగంతో తీసింది అంతకన్నా కాదు. కాని ఒక ఛాలెంజ్‌గా భావించి తీసిన డాక్యుమెంటరీ. చార్మినార్ నీడన కనిపించే నిత్య , సత్య జీవితాన్ని అర్థవంతంగా అందమైన ఫ్రేమ్‌గా మలిచిన చిట్టి సినిమా. నాలుగు వందల సంవత్సరాలుగా చార్మినార్ కథలు వింటున్నా దాని చుట్టు పక్కల ఉన్న జీవితాన్ని కెమెరా కన్నుతో లోతైన చూపు విసిరినవాళ్లు అతి తక్కువ అనే చెప్పాలి. అందుకే చార్మినార్ చుట్టూ అల్లుకున్న జీవితాన్ని చూపించిన ఈ డాక్యుపోయెమ్ వీక్షకులు కళ్లు తిప్పుకోలేని అందమైన దృశ్యమాలిక అయింది. అయినంపూడి శ్రీలక్ష్మి స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో వచ్చిన ఈ డాక్యుమెంటరీలో ప్రణాళికలు మొదలైన దగ్గర్నుంచి ది ఎండ్ దాకా ప్రతి అంశమూ ఆసక్తికరమే.

## ఇలా తట్టింది....

అనుకోవడం ఈజీ కాని చేయడం సవాలే కదా! అలా మొదలైందే నా డాక్యుమెంటరీ. నా నలుగురు బ్రదర్స్ అమెరికాలో ఉంటారు. వాళ్లు ఇక్కడకొచ్చినప్పుడల్లా షాపింగ్‌కు చార్మినారే వెళ్ళే వాళ్ళం. డాక్యుమెంటరీ దేని మీద తీయాలనే ఆలోచన చాలా రోజుల నుంచే ఉండడం వల్ల ఒకరోజు సడెన్‌గా మా పెద్దమ్మాయి సాయి నవ్యత దేనిమీదో ఎందుకు చార్మినార్ మీద తీయొచ్చు కదా! ఎంతో జీవితం ఉందిక్కడ అని ఓ సలహా ఇచ్చింది. నిజానికి చార్మినార్ ప్రాంతంలోని జీవన వైవిధ్యం భారతదేశంలో ఎక్కడా కనిపించదు. నాకూ అదే కరెక్టు అనిపించింది. కాన్సెప్ట్ దొరికింది కాని క్యాష్ ప్రాబ్లం ఇంకా మిగిలే ఉందనుకున్న టైమ్‌లో మా చిన్నమ్మాయి సాయి హర్షిత ప్రొడ్యూసర్ అవుతానని ఆర్థిక భరోసా ఇచ్చింది. తన పాకెట్‌మనీ ఇలా ఉపయోగపడుతుందనుకోలేదు. కెమెరా పర్సన్ ఎవరంటూ ఆలోచిస్తుంటే మా ఇంట్లోనే కెమెరా ఉమెన్ ఉన్న విషయం గుర్తొచ్చి చాలా సంతోషంగా ప్లాన్ చేసుకున్నాం అంటూ డాక్యుపోయెమ్ వెనక జరిగిన కసరత్తులు పంచుకుంది శ్రీలక్ష్మి. సాయి నవ్యత అప్పటికే ప్రముఖ ఫోటో గ్రాఫర్ సైబా పరంధాములు దగ్గర ఫోటోగ్రఫీ మెలకువలు నేర్చుకుంది. ప్రొడ్యూసర్ సాయి హర్షితకు తన ఫ్రెండ్ రేవతి చంద్రలేఖ కూడా తోడయిన తరువాత డాక్యుమెంటరీ చకాచకా కదిలింది.

## 'ఎంటర్' టైన్‌మెంట్

ఆగస్టు నెల... రంజాన్ మాసం...! చార్మినార్ అందాలు కనిపించాలన్నా, అక్కడి జీవన పరిస్థితులు చూడాలన్నా అనువైన సమయం. రంజాన్ మాసంలో చార్మినార్‌లో కనిపించే సందడి,

హడావిడి పాప్ మ్యూజిక్ విన్నంత కిక్‌నిస్తుంది. అలాంటి బిజీటైంలో ఆ ఏరియాలోకి ఎంటర్ అయ్యారు శ్రీలక్ష్మి అండ్ టీమ్. చేతిలో హ్యాండీకామ్... లేడీస్... డాక్యుమెంటరీ... చార్మినార్! ఫీల్డ్ మీద ప్లానింగ్ లేకపోతే చాలా కష్టం. నిజానికి అదొక ఛాలెంజింగ్ టాస్క్. మొట్టమొదట డీజీపీతో అనుమతి తీసుకుని పోలీస్ ప్రాబ్లెమ్స్ నుంచి క్లియరెన్స్ తెచ్చుకున్నారు. ఇక చార్మినార్ చుట్టుపక్కల జీవితాల్లో ఇరవైనాలుగు గంటలు ఎలా గడుస్తాయో చూపించాలి. అదీ డాక్యుమెంటరీ!!

### షాట్ అండ్ షూట్

సినిమా మొదలైంది. షూటింగ్‌కు ఇబ్బందుల్లేవు. కానీ షూట్ చేయడానికి అనువుగాలేని షాపులు, స్థలాలూ, ఎప్పుడూ షాపింగ్ బిజీతో ఉండే ఆ ప్రాంతంలో షాపు యజమానులు సహకరించలేని పరిస్థితి అందుకే వాళ్ల రూట్లోకి వెళ్లి అవసరం లేకపోయినా నాలుగైదు వేలు షాపింగుకు సమర్పించుకుని షూట్ చేసే వాళ్లు. 'ఆ...మీతో మాట్లాడితే మాకేంటీ?' అని అడిగిన వాళ్లు కూడా ఉన్నారు. వాళ్లందరినీ ఫ్రెండ్స్‌లా 'ట్రీట్' చేస్తూ షూట్ చేస్తూ ముందుకెళ్లేవాళ్లు. యాచకులు కూడా 'డిమాండ్'ను బట్టి బైట్ ఇచ్చారట. అవన్నీ వర్క్ ఎంజాయ్‌మెంట్‌గానే భావించారు. కొంత సొమ్ము ముట్ట చెప్పుకున్నా పట్టువిడవకుండా పని కానిచ్చారు.

### నాలుగు గంటల మూవీ

ఆరు రోజులు చార్మినార్‌లో షూటింగ్, అంతా కలుపుకుని మొత్తం నాలుగు గంటల సినిమా వచ్చింది. అసలు కథ ఇక్కడే మలుపు తిరగాలి. ఆ లాంగ్ రషెస్‌ను షార్ట్ చేయాలి. ఇక్కడో సమస్య ఎదురైంది. అదే 'ఎడిటింగ్' అప్పటి దాకా శ్రీలక్ష్మి అండ్ టీమ్‌కు దొరకని టెక్నీషియన్. కాని అతి తొందరగా 'సుమశ్రీ' ఎడిటర్‌గా పనిచేసింది. మొత్తానికి 24రోజుల్లో పదహారున్నర నిమిషాల డాక్యుమెంటరీ బయటకొచ్చింది. నలభై ఐదు వేలు ఖర్చయ్యాయి. అప్పటికే గోవాలో ఫిలింఫెస్టివల్స్ జరిగాయి కాని ఆ టైమ్‌కు డాక్యుమెంటరీ పూర్తి కాలేదు.

### ఫస్ట్ ఛాన్స్

స్క్రిప్ట్, వాయిస్ ఓవర్ శ్రీలక్ష్మి చూసుకుంది. పెద్ద పని పూర్తయింది. చివర్న ఆత్మసంతృప్తి మిగిలింది. వాట్ నెక్స్ట్ అనుకుంటున్న సమయంలో "పాలపిట్ట నేషనల్ షార్ట్ అండ్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్స్" కరీంనగర్‌లో జరుగుతున్నాయని తెలిసింది. రెండు రోజుల్లో స్క్రీనింగ్ ఉందనగా 'లైఫ్ ఎట్ చార్మినార్' డివిడి పంపించారు. స్క్రీనింగ్ జరిగిన రోజు శ్రీలక్ష్మి అండ్ టీమ్‌కు ఉద్విగ్న క్షణాలు. న్యాయనిర్ణేతలను ఈ ప్రయోగాత్మక డాక్యుపోయెమ్ ప్రత్యేకంగా ఆకర్షించింది. అందుకే స్పెషల్ జ్యూరీ అవార్డును ఎగరేసుకొచ్చింది!!

**శ్రీలక్ష్మి అంటే....**

ఒక యాంకర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్టు. ఈవెంట్ ఆర్గనైజర్. కవయిత్రి, డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్...! అంతేకాదు ప్రియమిత్రులను గుర్తు చేసేలా. "శ్రీహరి చంద్ర క్రియేషన్స్" మీద డాక్యుమెంటరీ తీసిన స్నేహలత. అన్నిటికి మించి మానవీయత నిండిన మహిళ. తన పిల్లలకు కూడా పుట్టిన గడ్డపై మమకారాన్ని, మనుషుల మధ్య మానవత్వాన్ని నూరిపోస్తున్న సగటు అమ్మ. సాధారణంగా వినిపించే కుటుంబ నేపథ్యమే ఆమెది. శ్రీలక్ష్మి చదువంతా పుట్టి పెరిగిన నిజామాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే సాగింది. సాంస్కృతిక విభాగాల్లో పాల్గొనడం మొదట్నుంచి హాబీ, యాంకర్‌గా మారిన తరవాత ఎన్నో సన్మాన, సత్కారాలు అందుకుని వృత్తిలో విజయం సాధించింది. నాలుగు వేలకు పైగా ప్రోగ్రామ్స్ నిర్వహించినందుకు 'ప్రత్యేక సన్మానం' కూడా పొందింది. ఇరవై ఏళ్లుగా ఆల్ ఇండియా రేడియో లో అనౌన్సర్‌గా పనిచేస్తోంది. చిన్నప్పటి నుంచి కవిత్వం అంటే చాలా ఇంట్రెస్టు. అందుకే 'అలల వాన'పుస్తకం రాయగలిగింది. త్వరలోనే 'వాయిస్ కల్చర్' మీద మరో పుస్తకం రాయబోతోంది.

**మూలం ఇక్కడ**

శ్రీలక్ష్మి టీవీ నంది అవార్డు జ్యూరీ మెంబర్. అందులో భాగంగానే దాదాపు నూటా డెబ్బయి డాక్యుమెంటరీలు చూసింది. కొన్నింటిని చూసినప్పుడు ఇవీ డాక్యుమెంటరీలేనా? డాక్యుమెంటరీ తీయడం ఇంతేనా? అనుకునేది కాని 'దిగితేకాని లోతు తెలియదు' అని ఓ మిత్రుడు గుర్తు చేయడం వల్ల ఆ సంగతేంటో చూడాలనుకుంది. ఉద్దేశం ఏదయినా యూనివర్సల్ పాయింట్‌తో, హ్యూమానిటీని మరిచిపోకుండా తీసిన డాక్యుపోయెమ్ ఆమెను విజేతగా నిలిపింది. మీ ఇన్‌స్పిరేషన్ ఏంటి? అని అడిగితె నా చుట్టు పక్కల కనిపించే జీవితాలే నాకు ఇన్‌స్పిరేషన్ అంది. ఇలాంటి విజయాలు మాలాంటి ఎందరికో స్ఫూర్తినిస్తాయి. క్రియేటివిటీ ఉంటే సరిపోదు దాన్ని చూపించేందుకు అవసరమైన ప్లాట్‌ను కూడా వెతుక్కోవాలి. అది తెలిస్తే చాలు ఎవరైనా నెంబర్‌వన్ అవుతారు' అంటూ తాను త్వరలో చూపించబోయే లైఫ్ ఇన్ కార్పొరేట్, లైఫ్ ఇన్ స్లమ్, లైఫ్ ఇన్ రెయిన్‌ల, గురించి ప్రస్తావిస్తూ ముగించింది శ్రీలక్ష్మి.


**బి. మహేందర్**

**ఫోటోలు : కోనేటి వెంకట్**




సాకారమైన సంకల్పం
జీవితానికి
ఓ సరికొత్త స్ఫూర్తినిస్తుంది.

# The Crew



Sai Harshitha, Sri Laxmi, Sai Navyatha




Revathi Chandralekha Ponnam



Suma Sri

# The Poster


Sri Hari Chandra Creations
Life@
Charminar
A Docu-Poem
Inampudi Srilaxmi
REVATHI CHANDRA SAI NAVYATHA SAI HARSHITHA SUMASRI



## LIFE @ CHARMINAR *(A DOCU-POEM)*

The Charminar is a well-known historical monument. It symbolizes the city of Hyderabad with all its gigantic and vibrant cultural past and eventful present. The human life with its myriad forms and dimensions around it, has added the essential dynamism to the static structure of Charminar, and made it into the most happening and hopeful place to charm, celebrate and churn. The then symbol of victory over misery, has become an abode of poverty and prosperity; glitz and garbage, now.

Life @ Charminar is a tribute to the different angles of human life pervaded around Charminar in general and at the auspicious occasion of RAMZAN in particular, within the modes of Night and Day times. It is a human document, which envisages the ecstasy and the agony with equal vigour and vision. The socio- economic, politico-cultural affairs and the aesthetical expressions, emotional realities of the people around the Charminar, is the under current thread that drives this human document. Here, The Charminar visualizes as the immobile human-being, which reveals many moods in silence and every human as the moving Charminar.

This is a "docu-poem" and first of its kind novel experiment in its style in the history of Documentaries. It is a perfect blend of poetic expression and documentary presentation. In addition to it, the "docu-poem" is unique in other terms too, as this work is carried out by a creative team of all-women technicians.

The 'Docu - Poem' had won the prestigeous **SPECIAL JURY AWARD** in the 5th NATIONAL SHORT FILM & DOCUMENTRY FILM FESTIVAL organised by **KAFISO** in 2011.

